
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 75 వ భాగం

## అజామీళోపాఖ్యానం – 10

## యముడి సమాధానం

'నారాయణ' అంటూ దేహం వదిలేసిన అజామీళుణ్ణి యమపాశాలనుంచి విష్ణుదూతలు విడిపించారు; యమదూతలు ఏమీ చేయలేక అతన్ని వదిలేసి యమధర్మరాజు దగ్గిరకి వెళ్ళారని శుకమహర్షి చెప్పాక, వాళ్ళతో యముడు ఏమన్నాడో తెలుసుకోవాలని ఉందని పరీక్షిత్తు శుక మహర్షిని అడిగాడు. దీనికి సమాధానం చెప్తున్నాడు.

క. శ్రీకృష్ణభటులచేత ని
రాకృతులై యామ్యభటులు యమునకు నాత్మ
స్వీకృత విప్రకథా క్రమ
మీ క్రియ ము న్దెలిపి రదియు నెఱింగింతుఁ దగన్. [6-161]

తే. చేరి త్రైవిధ్యమున మించు జీవతతికిఁ
గర్మఫలములఁ దెలిపెడు కారణంబు
లగుచు శిక్షించువార లీ యవనిమీఁద
దేవ! యెందఱు గలరయ్య! తెలియవలయు. [6-162]

ఇలా యమదూతలు వెళ్ళి తమ నుండి విడిపించబడిన అజామీళుడి కథ చెప్పబోతూ అడుగుతున్నారు, యమరాజుని. త్రిగుణాలతో (సత్వ, రాజస, తామస) కర్మ చేసే జీవులకి శిక్ష వేసేవాళ్ళు ఈ ప్రపంచలో ఎంతమంది ఉన్నారు? గమనించారా? కర్మ ఏ గుణంతో చేసిందయినా సరే – మంచో చెడో, దాని ఫలం అనుభవించి తీరాలి. ఇప్పుడు వీళ్ళు అడిగేదేమిటంటే ఇప్పటివరకూ మమ్మల్ని ఎవరూ అడ్డగించలేదు, ఇప్పుడిలా అయిందంటే ఈ శిక్షలు వేసేవాళ్ళు మనం కాక మరొకరు ఉండి ఉండొచ్చు కదా? అలా అసలు ఎంతమంది ఉన్నారు?

క. దక్షిణదిశాధినాయక!
శిక్ష దగం జేయువారు క్షితిఁ బెక్కండ్రే
నీ క్షయమును నక్షయమును
సాక్షాత్తుగ నెందు రెండు సంపన్న మగున్? [6-163]

యమరాజా, (దక్షిణదిశాధినాయక, దక్షిణ దిశకి నాయకుడు, యముడు) శిక్షలు వేసేవాళ్ళు చాలామంది ఉన్నట్టయితే (పెక్కెండ్రు), చావు (క్షయము), అక్షయము (పుట్టుకలు) రెండూ సంపన్నం ఎలా అవుతాయి? ఒకరు శిక్ష వేస్తున్నప్పుడు రెండోవాళ్ళు ఆ శిక్ష తీసేస్తున్నారనుకోండి, అసలు ధర్మాధర్మాలు అనుసరించడం అసంభవం కదా?

తే. దట్టమైనట్టి కర్మబంధముల నెల్ల
నాజ్ఞ బెట్టెడువారు పెక్కైన చోట
నకట! శాస్తృత్వ ముపచార మయ్యెఁ గాదె?
శూరులై నట్టి మండలేశులకుఁ బోలె. [6-164]

జనం చేసే అనేకానేక (దట్టమైనట్టి) కర్మలకి శిక్షలు వేసేవారు (ఆజ్ఞ పెట్టెడువారు) చాలామంది ఉంటే, అయ్యో, శాసనం అనేది (శాస్తృత్వము) ఉపచారం (నామమాత్రం) అవుతుంది కదా?

ఉ. కావున నీవ యొక్కఁడవ కర్తవు మూఁడు జగంబులందు సం
భావిత భూతకోటిఁ బరిపాకవశంబున శిక్షజేయఁగా
నీ వర శాసనం బఖిలనిర్ణయమై తనరారుచుండ నేఁ
డీవలఁ గ్రమ్మఱింప మఱి యెవ్వఁడు శక్తుఁడు? ధర్మపాలనా! [6-165]

అందువల్ల మేము అనుకునేదేమంటే మూడులోకాలకీ నువ్వే పరిపాలకుడవి, శిక్షలు వేయడానికీను. నీ శాసనం తిరుగులేనిది (అఖిలనిర్ణయమై తనరారుచుండ). ధర్మపాలుడవైన నిన్నూ, ఇటువంటి నీ శాసనాన్నీ అతిక్రమించడానికి మరొకరికెవరికి శక్తి ఉంది?

సీ. ఇట్టి నీ దండంబ యీ మూఁడుజగములఁ;
దెగువమై నేఁడు వర్తిల్లుచుండ
మనుజలోకంబున మహితాద్భు తాకార;
సిద్ధుల మిగులఁ బ్రసిద్ధు లైన
వారు నల్వురు వేగ వచ్చి నిర్దేశంబు;
భంగించి మమ్మంత చెంగఁదోలి
నీ శాసనంబున నే మీడ్చి కొనువచ్చు;
క్రూరచిత్తునిఁ బుచ్చికొని యదల్చి [6-167]

తే. పాశబంధంబు లీసునఁ బట్టి త్రెంచి
బలిమి మిగులంగ మమ్మును బాఱఁదోలి
యిచ్చఁ జనినారు వారు దా మెచటివార
లాదరమ్మున మాకు నేఁ డానతిమ్ము. [6-167.1]

వ. అని" రని మఱియు శుకుం డిట్లనియె "నట్లు దూతలు పరితాప సమేతులై పలికిన, దండధరుఁడు పుండరీకాక్షుని చరణకమలంబులు దన మానసంబున సన్నిహితంబుగఁ జేసికొని, వందనం బాచరించి, పరమ భక్తిపరుండై వారల కిట్లనియె.

[6-168]

మూడులోకాల్లో నిరాటంకంగా జరిగే ఇటువంటి నీ శాసనాన్ని అమలు చేయడానికి మేము వెళ్ళాం ఓ క్రూరుణ్ణి పట్టి తేవడానికి. ఈ లోపునే అద్భుతమైన ఆకారం కల ఓ నలుగురు, సిద్ధులో, మరొకరో వచ్చి ఆ పాశాలన్నీ విడిపించి మమ్మల్ని అదిలించారు. వాళ్ళెక్కడివారో, ఎవరో మాకు తెలియచేయి.

వీళ్ళు ఇలా అడిగే సరికి యముడు పుండరీకాక్షుణ్ణి, విష్ణువుని మనసులో తల్చుకుని చెప్తున్నాడు.

సీ. కలఁడు మదన్యుండు ఘనుఁ డొక్కఁ డతఁ డెందు;
వెలికిఁ గానఁగరాక విశ్వమెల్లఁ
నతిలీనమై మహాద్భుత సమగ్రస్ఫూర్తి;
నుండును గోకఁ నూలున్నభంగి
దామెనఁ బశువులు దగిలి యుండెడు మాడ్కి;
నామసంకీర్తన స్థేమగతుల
విహరించు నెవ్వఁడు విలసిత మత్పూజ;
లెవ్వని పదముల నివ్వటిల్లుఁ [6-169]

ఆ. గనుట మనుట చనుట గల్గు నెవ్వని లీల
లందు లోక మెవనియందుఁ బొందు
నెన్నఁబడుచుఁ బుడమి నెవ్వని నామముల్
కర్మబంధనముల పేర్మి నడఁచు. [6-169.1]

నాకంటే అన్యుడు (మదన్యుండు), ఘనుడైనవాడు మరొకడున్నాడు. బయటకి కనిపించని (వెలికి కానరాక), విశ్వమంతా నిండిఉన్న మరొక మహాద్భుతమూర్తి మరొకడున్నాడు. ఆయన చీరలో (కోక) దారంలాగా (నూలున్నభంగి) అంతటా వ్యాపించినవాడు. ఆయన ఆజ్ఞానుసారం తాళ్లతో కట్టబడిన పశువుల్లాగా (దామెనఁ బశువులు దగిలి యుండెడు మాడ్కి) తిరుగుతూ బతుకుతున్నారు జనులందరూను. ఆయన నామం పలికితే బంధాలన్నీ తొలగిపోతాయి (కర్మబంధనముల పేర్మి నడఁచు).

త. వినుఁడు నేను మహేంద్రుఁ డప్పతి వీతిహోత్రుఁడు రాక్షసుం
డనిలుఁ డర్కుఁడు చంద్రుఁడుం గమలాసనుండు మరుద్గణం
బును మహేశుఁడు రుద్రవర్గము భూరి సంయమి సిద్ధులున్
మొనసి కన్గొనజాల రెవ్వని మూర్తి విశ్రుతకీర్తిమై. [6-170]

ఇంకా వినండి, నేను, దేవేంద్రుడు, వరుణుడు (అప్పతి, అప్పు–నీరు, పతి – కారణం/ప్రభువు), వీతిహోత్రుడు (అగ్నిహోత్రుడు), అనిలుడు (వాయుదేవుడు), అర్కుడు (సూర్యుడు), చంద్రుడు, కమలాసనుండు (కమలం ఆసనంగా లకలవాడు, బ్రహ్మ), మరుద్గణాలు, మహేశుడు (శంకరుడు), రుద్రవర్గము (రుద్రగణాలు), ఎంతో సంయమనం సాధించిన సిద్ధులు ఎవరమూ కూడా ఆయనన్ని పూర్తిగా తెలుసుకోలేకపోతున్నాం. ఇంక మామూలు జనం గురించి చెప్పడానికేమి ఉంది?

ఈ పద్యం వృత్తం గమనించారా? ఈ వృత్తం పేరు తరళం. మనం చిన్నప్పుడు చదువుకున్న తెలుగు పద్యాల్లో మనకి చాలామటుకు తెల్సినవి – ఉత్పలమాల, చంపకమాల, మత్తేభం, మత్తకోకిల, శార్దూలం, ఆటవెలది, తేటగీతి, సీసం వగైరా అయితే మనకి తెలియని వృత్తాలు తరళం, స్రగ్ధర, మహాస్రగ్ధర, మంగళమహాశ్రీ, ఉత్సాహవృత్తము అనేవీ, మనకి తెలియని అనేకానేకమైనవి భాగవతంలో చూడవచ్చు. భాగవతం రాయడానికి తనకి లభించిన ఈ అవకాశంలో సింగయ ఈ వృత్తాలన్నీ వాడి తన తెలుగు పాండిత్య విద్వత్తు చూపించడం మనం గమనిస్తాం ముందు ముందు.

చ. అభవు నమేయు నవ్యయు ననంతు ననారతుఁ బూని మేనిలో
నుభయము నై వెలుంగు పురుషోత్తముఁ గానరు చిత్తకర్మ వా
గ్విభవ గరిష్ఠులై వెదకి వీఱిఁడి ప్రాణులు; సర్వవస్తువుల్
శుభగతిఁ జూడనేర్చి తనుఁ జూడఁగనేరని కంటిపోలికన్. [6-172]

అభవుణ్ణి (పరమేశ్వరుణ్ణి), అమేయుడూ (హద్దులు లేనివాడు), అవ్యయుడూ, అనంతుడూ అయి క్షరమైన తమ శరీరంలో అక్షరుడుగా వెలుగొందే పురుషోత్తముడైన నారాయణుణ్ణి, చిత్తకర్మలతో, గర్వంతో ఆరితేరిన జనం గ్రహించలేరు. ఎందుకంటే, అన్నింటినీ క్షుణ్ణంగా చూడగలిగే కన్ను తనని తాను చూసుకోలేదు కదా? ఇదే విషయాన్ని రమణ మహర్షి అనేకసార్లు చెప్పడం గమనించవచ్చు. నేనెవడను అంటూ దృష్టి లోపలకి మళ్ళించడమే తపస్సు అంటారు. క్రిందటి వ్యాసాల్లో చెప్పినట్టూ, ఇదే పంచ మహావాక్యాలు చెప్పేది కూడా.

చ. పరముని భక్తలోక పరిపాలన శీలుని దుష్టలోక సం
హరుని పతంగపుంగవ విహారుని కూరిమిదూత లామనో
హరులు సురేంద్రవందితులు నా హరిరూప గుణస్వభావులై
తిరుగుచునుందు రెల్లడలఁ దిక్కులఁ దేజము పిక్కటిల్లఁగన్. [6-173]

ఇప్పుడు మీరు చూసిన ఆ మనోహరమైన విష్ణుదూతలకి దేవేంద్రుడైనా నమస్కరిస్తాడు (సురేంద్రవందితులు). వాళ్ళు దివ్యతేజస్సుతో శ్రీహరి గుణాలతో దశదిశల్లోనూ తిరుగుతూ ఉంటారు. ఈ పద్యంలో విష్ణుదూతలని సింగయ ఏమన్నాడో గమనించారా? పరముని (సర్వానికి ఆధారమైనవాడు), భక్తలోక పరిపాలన శీలుని, దుష్టలోక సంహరుని, పతంగపుంగవ విహారుని కూరిమిదూతలు. పతంగపుంగవము అంటే విహరించే పక్షులలో మేటిది – గరుడుడు. దానిమీద విహరించేవాడు, నారాయణుడు. ఇటువంటివాడి కూరిమి దూతలు – ఇష్టమైన సేవకులు.

ఈ అజామీళోపాఖ్యానం, యముడి సమాధానంతో ముగియడం వచ్చే నెల వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS